పసుపు... లాభాల గుబాళింపు





కొండపడలో సాగు చేస్తున్న పసుపు



పసుపు సాగుపై గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్న హార్టికల్చర్ అధికారిణి శరణ్య మాధురి

- గిరిజన గ్రామాల్లో విస్తారంగా సాగు
- ప్రకృతి విధానంలో పండిస్తున్న రైతులు
- బహిరంగ మార్కెట్‌లో మంచి గిరాకీ
- ఈ ఏడాది మంచి ధర పలికిన పంట

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో పండించే పసుపునకు బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.దీంతో గిరిజన రైతులు పసుపు విస్తారంగా పండిస్తున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో పసుపు సువాసన వెదజల్లుతోంది. గ్రామాల సమీపంలోని కొండ,పోడుతో పాటు పల్లంగా ఉన్న భూముల్లో దిగుబడులు బాగుండడంతో గిరిజన రైతులు సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.అరకు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో నాలుగు మండలాల్లో పసుపు పంటను అధికంగా గిరిజన రైతులు సాగు చేస్తున్నారు.

సేంద్రియ పద్ధతిలో ..

గిరిజన ప్రాంతంలో సేంద్రియ పద్ధతిలో రైతులు పసుపు సాగు చేస్తున్నారు.రసాయన ఎరువులు,పురుగు మందులను వాడకుండా పండిస్తుండడంతో కర్కుమిన్ కంటెంట్ 5శాతం ఉంటుందని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు.దీంతో మైదాన ప్రాంతాల్లో గిరిజన ప్రాంతానికి చెందిన పసుపునకు మంచి డిమాండ్ ఉంది.గిరిజన ప్రాంతాల్లో జరిగే వారపు సంతల్లో వడ్డాది, మాడుగుల,అనకాపల్లి,కాకినాడ,తుని వంటి ప్రాంతాల నుంచి మైదాన ప్రాంత వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మంచి డిమాండ్ ఉన్న పసుపు సాగుకు ప్రభుత్వం,ఐటీడీఏ నుంచి పెట్టుబడికి ఆర్థిక సహాయం చేస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

అంతర పంటగా..

పెట్టుబడి తక్కువగా ఉండడంతో పాటు అధిక ఆదాయం వస్తుండడంతో అంతర పంటగా కూడా పసుపును సాగుచేస్తున్నారు. మామిడి, సిల్వర్‌వోక్ తోటల్లో వీటిని అంతర్‌పంటగా సాగు చేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో 10 కావిడ్ల వరకు పసుపు నాటితే 20 నుంచి 25 కావిడ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు.ఈ ఏడాది పసుపు ధర బాగుంది. బహిరంగ మార్కెట్‌లో కిలో పసుపునకు రూ.100 నుంచి రూ.130 వరకు ధర లభిస్తోంది. రూ.10వేలు పెట్టుబడి పెడితే రూ.15వేలు పైగా లాభాలు వచ్చాయని పలువురు రైతులు తెలిపారు.వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయని,దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. ముంచంగిపుట్టు మండలంలో 1,820 ఎకరాలు, డుంబ్రిగుడలో 1,150,పెదబయలులో 3,710,హుకుంపేట మండలంలో 2,256 ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు.

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి



గిరిజన ప్రాంతంలో పండించే పసుపు మంచి నాణ్యతతో ఉంటుంది.మంచి ఛాయ వస్తుంది.మైదాన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వ్యాపారులు వచ్చి వారపు సంతల్లో పసుపు కొనుగోలు చేస్తున్నారు.సాగు విస్తీర్ణం మరింత పెంచేందుకు ప్రభుత్వం నుంచి గిరిజన రైతులకు సహాయం అందించాలి. గిరిజన ప్రాంతంలో మార్కెటింగ్ సదుపాయం సైతం కల్పించాలి.

– **కిల్లో లోకినాథ్**, గిరిజన పసుపు రైతు, బిమిడి గ్రామం,ముంచంగిపుట్టు మండలం

సబ్సిడీ రుణాలివ్వాలి



పసుపు పంట పండించే గిరిజన రైతులకు గిటుబాటు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.ముఖ్యంగా మండల కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి,మార్కెట్ సదుపాయాలు కల్పించాలి.సాగును ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం,ఐటీడీఏ నుంచి రాయితీపై రుణాలు అందించాలి.పసుపు సాగు విస్తీర్ణం పెంచే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలి.

– ఎం.ఎం.శ్రీను, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు,ముంచంగిపుట్టు

అధిక దిగుబడి సాధించేలా కృషి

పసుపు సాగు చేసుకునే రైతులకు అన్ని రకాలుగా సహాయసహకారాలందిస్తున్నాం. పసుపు దిగుబడి పెంచేందుకు సూచనలు,సలహాలు అందిస్తూ,అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.పసుపులో విత్తన శుద్ధి ట్రైకోడెర్మా,సూడోమోనాస్‌తో చేసుకోవాలని,బోదెసాళ్ల పద్ధతిలో మట్టిను శుద్ధి చేసుకోవాలని,మల్చింగ్ వంటి చేసుకోవాలని తెలియజేస్తున్నాం.

–**శరణ్య మాధురి**, మండల హార్టికల్చర్ అధికారి, ముంచంగిపుట్టు

క్లుప్తంగా

ముంచంగిపుట్టులో గణేశ్ ఉత్సవాల సందడి



ముహూర్తపు రాట వేస్తున్న హనుమాన్ యూత్ సభ్యులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో అప్పుడే గణేశ్ ఉత్సవాల సందడి మొదలైయింది.మంగళవారం స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘం భవనం సమీపంలో వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన ముహూర్తపు రాటను హనుమాన్ యూత్ సభ్యులు వేశారు.వచ్చే నెల 27వ తేదీన జరిగే వినాయక చవితి పండగకు నెల రోజు ముందుగానే రాట వేసే కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ.దీనిలో భాగంగానే ఆది దేవుని ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వెలుగు ఏపీఎం దేవ మంగ,హనుమాన్ యూత్ సభ్యులు శ్రీధర్, మధు, ఇంద్ర, లావణ్య, మణి, హర్ష, శివమణి,పవన్ పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



లబ్బంగిలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ తిరుమలరావు

చింతపల్లి: గిరిజన రైతులు వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వి. తిరుమలరావు అన్నారు. లంబసింగి పంచాయతీ లబ్బంగి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి నాట్లు జోరుగా జరుగుతున్నాయన్నారు. నాట్లు వేసే ముందు వరి నారు చివర ఆకులు తుంచి,జీవామృతంలో ముంచి పలుచగా ఒకటి రెండు మొనలతో నాట్లు వేసుకోవాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని చెప్పారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి టి. మధుసూదన రావు,ఆత్మ ఏటీఎం మహేశ్వరి,వీహెచ్ఏ చంద్రకళ, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ మండల అధికారి వరప్రసాద్

జి.మాడుగుల: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై వీహెచ్ఏ,ఐసీఆర్‌పీఎస్ యూనిట్ ఇన్‌చార్జిలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి వరప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. వీహెచ్ఏలు, వీఏఏలు ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కృషి చేయాలని తెలిపారు. యూనిట్ ఇన్‌చార్జి మేడా ప్రసాద్ మాట్లాడుతూ ఆర్గానిక్ సర్టిఫికేషన్ ప్రతి రైతుకు వచ్చే విధంగా ప్రకృతి వ్యవసాయం విస్తరింపజేశాయాలన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఇన్‌చార్జిలు ప్రసాద్, రామలింగం, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న సీఆర్‌పీఎఫ్ జి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంట్ రాధ

వై.రామవరం: ప్రతి గ్రామంలో మొక్కలునాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సీఆర్‌పీఎఫ్ జి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎం. రాధ కోరారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఆపాఠశాల హెచ్ఎం, సిబ్బంది, విద్యార్థులు, సీఆర్‌పీఎఫ్ జి42 బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘన సన్మానం



జి.మాడుగులలో తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న పీసా కమిటీ అధ్యక్ష,ఉపాధ్యక్షులు

జి.మాడుగుల: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసి పదోన్నతిపై ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన గిడ్డి రాజ్‌కుమార్‌కు మండల పీసా కమిటీ అధ్యక్షుడు,17పంచాయతీల పీసా కమిటీ ఉపాధ్యక్షులు మంగళవారం ఘనంగా సన్మానించారు. పీసా కమిటీ మండల అధ్యక్షుడు లకే రామకృష్ణ, పీసా కమిటీ ఉపాధ్యక్షులు కిముడు మణికంఠ, కిల్లో శ్రీను,కూడా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 17పంచాయతీల పీసా కమిటీల ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముంపు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి



మాట్లాడుతున్న సర్పంచ్ రామారావు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు జయరాజు

వీఆర్‌పురం: పోలవరం ముంపు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింప జేయాలని చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కోటం జయరాజు కోరారు. రైతులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ముంపు పేరుతో పథకాలను నిలుపుదల చేస్తే సహించేది లేదన్నారు. ముంపు ప్రాంతంలో 6 ఎకరాల పాతిక సెంట్ల భూమి ఉన్న ప్రతి రైతుకు భూమికి భూమి ఇస్తామని ప్రభుత్వమే ప్రకటించిందని, ఆ భూమికి అన్నదాత సుఖీభవ వర్తింప చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కరువైన హాస్టళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మరియదాసు

వీఆర్‌పురం: ప్రభుత్వ హాస్టళ్లలో మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని, నీళ్ల చారుతో సరిపెడుతున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మరియదాసు తెలిపారు. రేఖపల్లి లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు అధ్యక్షతన మంగళవారం బీసీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన దగ్గర నుంచి హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కరవయ్యాయన్నారు. విద్యార్థులకు సరైన భోజనం అందజేయడం లేదని ఆరోపించారు. పల్లెల్లో వీధివీధినా మద్యం ఏరులై పారుతోందని, బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయన్నారు. ఈ కార్యక్రమంలో కూనవరం మండల మహిళా ఉపాధ్యక్షురాలు కొమ్మని సునీత, బీసీసెల్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ దీకొండా గాంగధర్, బొడ్డు సత్యనారాయణ, చామంతుల వెంకన్న, రేవు బాలరాజు, ముత్యాల గౌతమ్, ముంజపు రాము, వద్దాణపు రాజారావు, చెవుడుబోయిన మధు, మోడం నరేష్, మాచర్ల గంగులు, చిక్కాల బాలు తదితరులు పాల్గొన్నారు

‘కూటమి’ హామీలపై ప్రశ్నించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై గ్రామ కమిటీలు ప్రశ్నించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పాంగి పద్మారావు తెలిపారు. జర్రెల పంచాయతీ మండిభలో మంగళవారం వైఎస్సార్‌సీపీ పంచాయతీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.పంచాయతీ కమిటీ అధ్యక్షుడిగా పలసి త్రినాథరావు,ప్రధానకార్యదర్శులుగా వంతాల కామేశ్వరరావు,లకే సింహాచలం,కార్యదర్శులుగా పలసి చిన్ని,బెల్నాయక్ సుమిత్ర ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు మాట్లాడుతూ అమలు కాని హామీలు ఇచ్చి అందలం ఎక్కిన కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. గత జగనన్న ప్రభుత్వంలో గడప వద్దకే సంక్షేమ పథకాలు,సుపరిపాలన అందించినట్టు చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన మేలును తెలియజేస్తూ, కూటమి ప్రభుత్వంలో పథకాలు అందక,హామీలు అమలు కాక పడుతున్న ఇబ్బందులను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ అరబీరు జగబంధు,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు వెంగడ రమేష్, పంచాయతీ బూత్ కమిటీ అధ్యక్షులు నాయకం సురేష్,వైఎస్సార్‌సీపీ మండల నేతలు సన్యాసిరావు, తిరుపతిరావు, బుద్దా, నీలకంఠం,రాజు,ధనుర్జయ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలతో హెల్త్ అసిస్టెంట్లకు మానసిక ఆందోళన



మాట్లాడుతున్న పోతురాజు

డుంబ్రిగుడ: ఉన్నతాధికారుల తీరుతో పాడేరు ఐటీడీఏ పరిధిలో 11 మండలాల్లో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.బి.పోతురాజు అన్నారు. ఆయన మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అస్తవ్యస్తంగా బదిలీలు చేస్తుండడంతో ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. రెండు నెలల క్రితం హెల్త్ అసిస్టెంట్‌లకు, వైద్య సిబ్బందికి బదిలీ చేశారని, అయితే బదిలీల ఆర్డర్ కాపీలు ఇవ్వకుండా, ఇప్పుడు మళ్లీ బదిలీలు నిర్వహిస్తామని అధికారులు చెబుతుండటంతో హెల్త్ అసిస్టెంట్లు మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. రెండు నెలల క్రితం బదిలీలు చేసిన వారికి ఆర్డర్స్ కాపీని ఇచ్చే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

గుర్తేడు కేంద్రంగా ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటటేష్ రాజు



రహదారి సదుపాయం లేక గుర్రాలపైనే ప్రయాణిస్తున్న ఆదివాసీలు

రాజవొమ్మంగి: వై. రామవరం మండలంలోని లోతట్టు ప్రాంతమైన గుర్తేడు కేంద్రంగా ప్రత్యేక మండలాన్ని ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గుర్తేడు కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేస్తే వై. రామవరంలోని అప్పర్‌పార్టు చింతలపూడి, కానివాడ, ధారగడ్డ, పాతకోట, బొడ్డగొంది తదితర లోతట్టు ప్రాంతాలకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

రహదారులు అభివృద్ధి చేయాలి

జీకే వీధి, మర్రిపాకల మీదుగా వెదురునగరం, వై. రామవరం నుంచి యార్లగెడ్డ మీదుగా మఠంభీమవరం, రాజవొమ్మంగి మండలంలోని వాతంగి నుంచి వేశంగి మీదుగా పెదమల్లాపురం వరకు రోడ్లు నిర్మిస్తే ఆయా ప్రాంత ప్రజలకు రహదారి రవాణా సదుపాయాలు మెరుగు పడతాయని రాజు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



వైద్యపరీక్షలు చేస్తున్న రవీంద్రనాథ్ చౌదరి

జీకే వీధి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్వీనగర్ వైద్యాధికారి రవీంద్రనాథ్ చౌదరి అన్నారు. టాంగులుగొందిలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గూడెంలో ఆదివాసీ జెండా ఎగురవేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుంజా శ్రీను

చింతూరు: వచ్చేనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఒకటో తేదీనుంచి గ్రామాల్లో నవోత్సవాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను తెలిపారు. మంగళవారం చింతూరులో ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవోత్సవాల్లో భాగంగా ప్రతి గూడెంలో ఆదివాసీలంతా కలసి జెండాలను ఎగురవేయాలని సూచించారు. రాజ్యాంగ ఫలాలు ఆదివాసీలకు అందని ద్రాక్షగా మారాయని, అంతరించిపోతున్న ఆదివాసీ జాతుల్ని పరిరక్షించడం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం, హక్కులను సాధించుకోవడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్, ఉద్యోగసంఘం నాయకుడు సోడె నారాయణ, శీలం తమ్మయ్య, మడివి రాజు, కాక సీతారామయ్య, సాయి, మీనాక్షి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటరమణ

చింతపల్లి: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కేసులు తప్పవని ఎస్ఐ వెంకటరమణ హెచ్చరించారు.మంగళవారం స్థానిక పాత బస్టాండ్‌లో వాహన దారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్సు, హెల్మెట్ తో పాటు అన్ని రికార్డులను కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ వాహనాలను నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

భవన నిర్మాణం పూర్తయిన తరువాతే విద్యార్థులను తరలించాలి



ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పెదబయలు: ముంచంగిపుట్టు మండలం లబ్బూరులో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవనం పనులు పూర్తయిన తరువాతే విద్యార్థులను అక్కడికి తరలించాలని ఏకలవ్య పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పెదబయలు వైటీసీ భవనంలో నిర్వహిస్తున్న ముంచంగిపుట్టు(లబ్బూరు) పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుమారు పదేళ్ల క్రితం ముంచంగిపుట్టు(లబ్బూరు) ఏకలవ్య పాఠశాలను మంజూరు చేశారని, అప్పటి నుంచి పాఠశాల భవన నిర్మాణం నత్తనడకన సాగుతోందన్నారు. అసంతపూర్తిగా ఉన్న భవనంలోకి విద్యార్థులను తరలిస్తే ఇబ్బందులు పడతారని చెప్పారు. ఈ విషయంపై కలెక్టర్, ఐటీడీఏ పీవోకు వినతి అందజేయనున్నట్టు తెలిపారు. తల్లిదండ్రులు అందజేసిన వినతిపత్రాన్ని ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

శిరగంపుట్టు రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీటీసీ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: మండలంలో జర్జుల పంచాయతీ బలడ గ్రామం పీఆర్ రోడ్డు నుంచి శిరగంపుట్టు ,మర్రిపుట్టు గ్రామాల వరకు నూతనంగా పీఎం జన్‌మన్ ద్వారా మంజూరైన రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎంపీటీసీ సభ్యురాలు వి.వి జయలక్ష్మి,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.పద్మారావు,నేతలు భూమిపూజ చేశారు.కొబ్బరి కాయలు కొట్టి,ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ శిరగంపుట్టు ప్రజల రవాణా కష్టాలు తీరనున్నాయని,పీఎం జన్‌మన్ పథకం ద్వారా సుమారు 2కిలో మీటర్ల రోడ్డుకు రూ.1.04 కోట్లు మంజూరు అయ్యాయని చెప్పారు. కాంట్రాక్టర్ త్వరితగతిన రహదారి నిర్మాణం పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాధురాం,పీసా కమిటీ ఉపాధ్యక్షుడు తిలక్,పంచాయతీ కార్యదర్శి నీలకంఠం,ఇంజినీరింగ్ అసిస్టెంట్ రమేష్,పంచాయితీ కన్వీనర్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న అరకులోయ సీఐ హిమగిరి

డుంబ్రిగుడ: మహిళల రక్షణే ధ్యేయంగా పోలీసుశాఖ పనిచేస్తోందని అరకులోయ సీఐ హిమగిరి అన్నారు. మండలంలోని నందివలస బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులతో మంగళవారం మాట్లాడారు. పోలీసుల పట్ల నమ్మకంతో ఉండలన్నారు. సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల మాటాలకు విలువ ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.పాపినాయుడు, హెచ్ఎం కంఠ శోరోమ తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన పెంచుకోవాలి

రాజవొమ్మంగి : గిరిజన బాలికలు సమాజంపై అవగాహన పెంచుకోవాలని జడ్డంగి ఎస్ఐ చిన బాబు అన్నారు.

ఆయన మంగళవారం అమీనాబాద్ గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థునులతో ఆయన మాట్లాడారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే వెంటనే దగ్గరలోని అధికారులకు, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోక్సో చట్టం, శక్తి యాప్ గురించి వివరించారు. హెచ్ఎం రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అమీనాబాద్ ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చినబాబు

చట్టాలపై విద్యార్థినులకు అవగాహన అవసరం

జి.మాడుగుల: పోక్సో తదితర చట్టాలపై విద్యార్థినులు అవగాహన ఏర్పర్చుకోవాలని స్థానిక అదనపు ఎస్ఐ బి. కుమార్ తెలిపారు.

గాంధీనగరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో మంగళవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోక్సో చట్టం, బాల్యవివాహాల నిషేధచట్టం, గుడ్ టచ్, బాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు విద్యపై దృష్టి సారించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ కాంచన తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగరం బాలికల ఆశ్రమ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న అదనపు ఎస్ఐ కుమార్